జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శుక్రవారం 1 మే 2026 పేజీలు : 14


2 లో..

## రైతు బాటల అభివృద్ధికి శ్రీకారం

## ఇందిరమ్మ ఇండ్ల వేగవంతం -- గర్భిణీల

# సంక్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

భువనగిరి ఏప్రిల్ 30(ప్రజా జ్యోతి న్యూస్) గుండాల మండలం అనంతారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక దృష్టి సారించారు. పనులు వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని పరిశీలించి, కొత్త గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెగ్యులర్ చెకప్‌లు, ప్రసవాలు జరగాలని ఆదేశించారు. అదనంగా, ఒక గర్భిణీ స్త్రీ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యాన్ని తెలుసుకుని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఇటీవల భర్తను కోల్పోయిన మహిళను పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇవ్వడం హృదయాన్ని హత్తుకునే విషయం.ఈ చర్యలు గ్రామాభివృద్ధి మరియు ప్రజల సంక్షేమంపై ప్రభుత్వ కట్టుబాటును స్పష్టం చేస్తున్నాయి.





## జర్నలిస్టు మధు కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు మిర్యాలగూడకు రానున్న డిప్యూటీ సీఎం

**మిర్యాలగూడ, ఏప్రిల్ 30,( ప్రజాజ్యోతి ):**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం మిర్యాలగూడ పట్టణానికి రానున్నారు. ఇటీవల సీనియర్ జర్నలిస్ట్, ఆయన వద్ద సి పి ఆర్ ఓ గా పనిచేస్తున్న మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మధుసూదన్ ది మిర్యాలగూడ కావటంతో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి వారి స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.



## హాస్టళ్ల పర్యవేక్షణలో మొబైల్ యాప్ వినియోగం తప్పనిసరి: కలెక్టర్


2 లో..

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తొట్ల స్వామి యాదవ్

**ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవపురం గ్రామంలో బండ శ్రీశైలం మంగ కూతురు కావ్య కుమారస్వామి రిసెప్షన్ గురువారం నిర్వహించగా వారి రిసెప్షన్కు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తొట్ల స్వామి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాఘవపురం సర్పంచ్ పరిధి మమత సంతోష్, ఉపసర్పంచ్ నరేష్, నాయకులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



# రైతు బాటల అభివృద్ధికి శ్రీకారం

**చింతలపాలెం, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):**

చింతలపాలెం మండలంలో రైతుల సౌకర్యాల కోసం బాటల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పైపులైన్ పనుల ద్వారా లభ్యమవుతున్న మట్టిని వినియోగించి రైతు పొలాలకు వెళ్లే మార్గాలను మెరుగుపరుస్తున్నట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి తెలిపారు. చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి సహకారంతో కొత్తపొల్లు రోడ్డుకు మట్టిని తరలించి పనులను ప్రారంభించారు. ఈ చర్యలతో రైతులకు పొలాలకు సులభంగా రాకపోకలు కలగడంతో పాటు గ్రామీణ మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మోర్తల వెంకట్ రెడ్డి, నాయకులు కాకునూరి హనిమిరెడ్డి, షేక్ మైబల్లీ, వీరంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, షేక్ మక్బుల్, సిపిఎం కార్యదర్శి జంగాల పుల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు వీరంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వీరారెడ్డి, చిత్తలూరి వీరబాబు, గుడిసె వెంకట్ రెడ్డి, యర్రం శంబిరెడ్డి, గోవిందా రెడ్డి, మొక్కంటి రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్ల పర్యవేక్షణలో మొబైల్ యాప్ వినియోగం తప్పనిసరి: కలెక్టర్

**భువనగిరి ఏప్రిల్ 30(ప్రజా జ్యోతి న్యూస్)**

మండల స్పెషల్ అధికారులు హాస్టళ్ల పర్యవేక్షణ సమయంలో గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నెల హాస్టళ్లను సందర్శించే సమయంలో విద్యార్థుల నివాస సదుపాయాలు, భోజన నాణ్యత, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పర్యవేక్షణలో గుర్తించిన సమస్యలను



మొబైల్ యాప్‌లో నమోదు చేయడం ద్వారా సంబంధిత శాఖలకు సమాచారం త్వరగా చేరి, సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు.మొబైల్ యాప్ వినియోగంతో పారదర్శకత పెరగడంతో పాటు పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అధికారులు యాప్‌ను సమర్థవంతంగా వినియోగించి హాస్టళ్లలోని సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..

**నూతనకల్, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికుల దాహార్తిని తెచ్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల అభివృద్ధి అధికారి సునీత అన్నారు.గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.వేసవిలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని అవసరాల నిమిత్తం మండల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళుతూ ఉంటారని వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఇంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఉపసర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి,ఎంపీఓ శశికళ,నాయకులు కాప రవికుమార్,ఉప్పుల వీరు యాదవ్,నవీన్ రెడ్డి,



శ్రీనివాసరెడ్డి,పంచాయతీ కారోబార్ శంబయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేవిఎస్ లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి - ప్రిన్సిపాల్ నాని ప్రసాద్

**మిర్యాలగూడ, ఏప్రిల్ 30, ( ప్రజాజ్యోతి ):**



మిర్యాలగూడ సమీపంలోని, దిలావర్ పూర్ వద్ద గల, పిఎం శ్రీ, కేంద్రియ విద్యాలయం లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను, ఇంటర్ మొదటి సంవత్సరం లో, ఎం పి సీ, బై పి సీ, ఎం ఈ సీ లో అడ్మిషన్ల కొరకు, ఆఫ్ లైన్ పద్దతిలో దరఖాస్తూ చేసుకోవాలని ప్రిన్సిపల్ నాని ప్రసాద్ గురువారం ప్రకటనలో కోరారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలకొరకు హెచ్ టి టి పి ఎస్ :// మిర్యాలగూడ .కె వి ఎస్ .ఏసీ . ఇన్ నందు సంప్రదించాలని, పూర్తి వివరాలకోసం నేరుగా, పాఠశాల ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని కోరారు .

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

## మండల వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి..

**నూతనకల్, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేపు అనగా (02-05 -2026న), మండల పరిధిలోని యడవల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నందు సోమవారం (04-05-2026) నాడు నిక్షయ ఎక్స్రే వారి ఆధ్వర్యంలో నిర్వహించే క్షయ వ్యాధి సంబంధిత ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి కోరారు.శిబిరంలో క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్ నాయక్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి...!

## పట్టణంలోని రహదారి ఫుట్ పాత్ లపై పార్కింగ్ నిషేదించాలి

## -టిడిపి నాయకుడు పోగుల సైదులు గౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 30,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని టిడిపి నాయకుడు పోగుల సైదులు గౌడ్ కోరారు. శుక్రవారం స్థానికంగా మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం లోని బైపాస్ రోడ్ పరిధిలో ముఖ్యంగా నందిపాడు చౌరస్తా, చిల్లాపురం రైల్వే స్టేషన్ రోడ్, చింతపల్లి చౌరస్తా గుంటూరు చౌరస్తా ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. బుధవారం జరిగిన ఒక దుర్ఘటనలో అధిక వేగంతో వచ్చిన కారు రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలు కావటం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తక్షణ చర్యలు అవసరం అన్నారు. అందులో భాగంగానే ఫ్లై ఓవర్ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టి ,పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసులను నిరంతరం విధుల్లో నియమించాలి వారు వాహనదారులపై చలానాలు వేయడానికి మాత్రమే కాకుండా పట్టణంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యల పరిష్కరించడానికి దోహదపడాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు మరియు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి. జీబ్రా క్రాసింగ్‌లు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి సీసీ కెమెరాలు అమర్చి ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉన్న కారణం చేత వీధి,చిరు వ్యాపారులు వాహనదారులు రోడ్డు ఆక్రమించకుండా తగు చర్యలు తీసుకోవాలి వీధి, చిరు వ్యాపారులకు అనువైన వ్యాపార స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు.రోడ్డు డివైడర్ నిర్మాణాల్లో కూడలిని వదిలి ఏర్పాటు చేయాలని,పట్టణంలోని సాగర్ రోడ్డు ప్రాంతాల్లో యూటర్న్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని,రాత్రి వేళల్లో సరిపడా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.పై చర్యలు అమలు చేస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు చేపట్టాలని కోరారు.



# మోత్కూరు పెద్ద చెరువులో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేయుటకు కృషి చేస్తా !

## తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

**మోత్కూరు, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):**

మోత్కూరు పెద్ద చెరువులో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేయుటకు సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. మోత్కూర్ పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం జరిగింది. సమావేశమునకు శాసన సభ్యులు మందుల సామెల్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం లో ప్రవేశపెట్టిన 84 అంశములతో కూడిన ఎజెండాను చర్చించి ఆమోదించడం జరిగినది. శాసన సభ్యులు మందుల సామెల్ మాట్లాడుతూ ప్రధాన కూడలిలో టాయిలెట్స్ ఏర్పాటు చేయవల్సిందిగా ఆదేశించారు. పెరుగుతున్న పట్టణ జనాభా దృష్ట్యా ఉదయ సముద్రం నుంచి వచ్చే నీటి సరఫరా పైప్ లైన్ దయాసే పెంచమని సూచించారు. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, వార్డు సభ్యులు కుర్మిళ ప్రమీల , సుల్తాన్ స్వామి , కొండా శోభ , మొగుళ్ళ అనురాధ , గనగాని శైలజ , పన్నాల శ్రీవిద్యా, బీసు శ్రీకాంత్ , నల్ల మధు , కారూపోతుల వెంకన్న , మెంట రమణ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందించి మోత్కూరు మున్సిపాలిటీని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ కె సతీష్ కుమార్, మేనేజర్ పి.ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

# చిలుకు స్వామికి శ్రమ శక్తి అవార్డు

**ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి**



యాదాద్రి జిల్లా ఆలేరు మండలం షారాజి పేట గ్రామానికి చెందిన చిలుకు స్వామి శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. గత 14 సంవత్సరాలుగా రైల్వేలో, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో, పనిచేస్తూ,పలు సేవలను అందిస్తున్నారు. అంతేకాకుండా, సికింద్రాబాద్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రెటరీగా, 42 వేల మంది కార్మికులకు సేవలాందిస్తున్నారు. అనేక రకాలుగా సేవలాందిస్తున్నందున, కార్మికుల దినోత్సవం మేడే ను పురస్కరించుకొని,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ ల చేతుల మీదుగా ఆయన శ్రమ శక్తి అవార్డును అందుకోనున్నారు. ఈ అవార్డును అందుకోబోతున్న చిలుకు స్వామికి షారాజీ పేట గ్రామానికి చెందిన ప్రముఖులు కంతి మహేందర్ రచ్చ రామ నరసయ్య,మొ రిగాడి అశోక్, సిరమైన వెంకటేష్ యాదవ్ లు అభినందనలు తెలియజేశారు.

# రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్ మాయం...



**అనంతగిరి ఏప్రిల్ 30 (ప్రజాజ్యోతి):**

రెవిన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంఫ్ మాయమైంది.మండల పరిధిలోని పాలవరం గ్రామంలో ఓ వ్యక్తి ప్రభుత్వం అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక డంపు చేశారని సమాచారంతో రెవెన్యూ అధికారులు సీజ్ చేసి గ్రామ కార్యదర్శికి అప్పగించారు.కాగా స్థానిక నాయకులు ఓ అధికారి సహాయంతో డంపు చేసిన వ్యక్తి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.డంపు నుండి ఇసుక తరలించాలంటే మైనింగ్ అనుమతులతో డిడి చలానాతో తరలించాల్సి ఉంటుంది ఇవేమీ లేకుండా అడిగేది ఎవరన్నట్లు ఇసుకను ఎత్తేచగా ఇతర ప్రాంతాలకు అమ్ముకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారుల సహకారం లేనిదే ఈ వ్యవహారం జరగదని,ఇన్ని రోజులు కళ్ళముందు డంపు కనిపించకపోయినా స్థానిక అధికారులు ఇసుక డప్పు ఏమైనట్లు అని విచారణ చేపట్టడం జరగలేదని కనీసం కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు అంటున్నారు.సీజ్ చేసిన ఇసుక డంపును అక్రమంగా తరలించిన వ్యక్తిపై అదేవిధంగా బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గంప వర్ధనమ్మ పార్థివ దేహానికి నివాళులు

**ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు గంప మనోహర్ మాతృమూర్తి గంప వర్ధనమ్మ గురువారం అనారోగ్యంతో మరణించ గా వారి పార్థవ దేహానికి బిజెపి పట్టణ అధ్యక్షుడు గంగేష్ జిల్లా కార్యదర్శి కృష్ణ కౌన్సిలర్ సంపత్ పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి ,తోట మల్లయ్య, దశరథ, భాస్కర్ ,మండల కార్యదర్శి బైరి మహేందర్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# ఒరిజినల్ చలాన్లు మా దగ్గరే... లైసెన్స్ మాత్రం వేరే వారికి?

## ఎక్సైజ్ వ్యవహారంలో భారీ అక్రమాల ఆరోపణలు

కోదాడ టౌన్, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):

బార్ లైసెన్స్ బదిలీ వ్యవహారం కోదాడలో సంచలనంగా మారింది. లక్షల రూపాయలు చెల్లించినప్పటికీ లైసెన్స్ తమకు దక్కలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఎక్సైజ్ శాఖపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. కోదాడ పట్టణానికి చెందిన శాఖమూరి కేశవరావు, మిర్యాల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లోని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరంగా తెలియజేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.




రూ.85 లక్షల ఒప్పందం... రూ.42 లక్షలు చెల్లింపు బాధితుల కథనం ప్రకారం... సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన నల్లగొండ అనిత పేరిట ఉన్న 'శ్రీ చెన్నకేశవ బార్ & రెస్టారెంట్' లైసెన్స్ కొనుగోలు కోసం ఈ ఏడాది జనవరిలో రూ.85 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ప్రభుత్వానికి ఉన్న బకాయిలను తీర్చేందుకు మార్చి నెలలో ఎస్‌బీఐ చలానా ద్వారా రూ.42 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఈ చెల్లింపులకు సంబంధించిన ఒరిజినల్ చలాన్లు తమ వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు.

### అదే చోట కొత్త బార్‌కు అనుమతులు... ఎలా?

లైసెన్స్ తమ పేరుపైకి మారుతుందని భావిస్తున్న సమయంలో



అనూహ్యంగా ట్విస్ట్ చోటుచేసుకుంది. అదే ప్రదేశంలో 'న్యూ సాయి స్వగత్ బార్ & రెస్టారెంట్' పేరుతో కొత్తవారికి లైసెన్స్ జారీ చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. "ఒరిజినల్ చలాన్లు మా దగ్గరే ఉన్నాయి. అవి లేకుండా అధికారులు ఎలా లైసెన్స్ మంజూరు చేశారు?" అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడ్డాయని వారు ఆరోపిస్తున్నారు.

### "ఇది పెద్ద కుట్రే..." బాధితుల ఆవేదన

"లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ బకాయిలు చెల్లించాం. అయినా లైసెన్స్ మాకు ఇవ్వకుండా వేరే వాళ్లతో బార్ ప్రారంభించడంలో పెద్ద కుట్ర ఉంది. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలి."

--- శాఖమూరి కేశవరావు, మిర్యాల నాగేశ్వరరావు



# కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సిద్ధారెడ్డికి సత్కారం

ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి



యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం అనుబంధ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రజాకవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి నీ గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలో కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధక బృందం కన్వీనర్ రామోజీ హరగోపాల్ మరియు రామకృష్ణ విద్యాలయం కరస్పాండెంట్ బండిరాజుల శంకర్, వెంకటరమణ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ అయ్యప్ప నవ సామాజిక వేత్త విద్యావేత్త కమలాకర్ శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం సిద్ధారెడ్డి మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఎంతో గర్వకారణం అని తెలుగు సాహిత్యాన్ని తన కలంతో కలల సహకారం కొరకై కృషి చేస్తానని సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజం...

– మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



హాలియా,ఏప్రిల్30(ప్రజా జ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.హాలియా పురపాలికలో వార్డు అధికారి జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న గాదె వెంకట రామచంద్ర రావు పదవి విరమణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని విధి నిర్వహణలో అందించిన సేవలు చిరస్థాయిలో నిలుస్తాయన్నారు.వెంకట రామచంద్ర రావు తమ బాధ్యతను నిబద్ధతతో పనిచేసే ఆదర్శంగా నిలిచారని చెప్పారు.ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.జీ.వి ఆర్ రావు సేవలు వృత్తికి పరిమితం కాకుండా మంచి లక్షణాలు వ్యక్తిత్వం కలవారని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో అనుముల మండల తాహాసిల్దార్ బి.రామచంద్రరావు, ఎంపీడీవో సుజాత,కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు,భోంగరాల యేసు రాజు,కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,మజహర్ మొహినుద్దీన్, చిట్టిప్రోలు కరుణాసాగర్,ఎడవల్లి రంజిత్,కో ఆప్షన్ సభ్యులు కొమ్మనబోయిన జయమ్మ, మున్సిపల్ సిబ్బంది,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో నేతన్న భరోసా సాయం పంపిణీ -- చేనేత కార్మికుల్లో ఆనందం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 30 (ప్రజాజ్యోతి):



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న భరోసా పథకం కింద పోచంపల్లిలో 3034 మంది చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందింది. ఈ పథకం ద్వారా ప్రతి చేనేత కార్మికునికి రూ.4500, సహాయకురాలికి రూ.1500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయబడింది. ఈ ఆర్థిక సహాయం అందడంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు మాట్లాడుతూ, నేతన్న భరోసా పథకం చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ సహాయం ద్వారా కార్మికుల జీవనోపాధికి కొంత ఊరటనిచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జోలి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బోనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వరరావు, తడక రమేష్, భారత లవ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# చందుపట్ల ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ ఆందోళన

నకిరేకల్



మండలం చందుపట్ల ఐకేపీ కేంద్రాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న రాజ్ సందర్శించి ధాన్యపు రాసులను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, ధాన్యం సేకరణలో జరుగుతున్న ఆలస్యంపై నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కల్లాలకు తీసుకొచ్చినా సకాలంలో కొనుగోలు జరగడం లేదని విమర్శించారు. ఇప్పటివరకు ప్రభుత్వం కనీసం 25 శాతం ధాన్యాన్ని కూడా సేకరించలేదని ఆరోపించారు. నకిరేకల్ నియోజకవర్గంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో వడ్ల రాసులు నెలల తరబడి అలాగే ఉండిపోతుండటంతో రైతులు కాంటాలు, లారీల కోసం ఎండల్లో పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ప్రతి గింజను వెంటనే సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును 48 గంటల్లో వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగా సులభంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్పోర్టేషన్ పేరుతో రైతుల నుంచి బస్తాకు రూ.6 వసూలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రైతులకు, హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలివేరు ప్రభాకర్, వంటెపాక సుందర్, చెరుకు వెంకటాద్రి, చెవుగోని శంకర్, చందర్ రావు, శ్రీను, సత్తయ్య, సాకుంట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం !

మోత్కూరు, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి):

అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత, సముచిత గౌరవం, గుర్తింపు ఇస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో పలు పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో గురువారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మోత్కూరు మున్సిపాలిటీ 12వ వార్డు నుంచి వివిధ పార్టీల నుంచి సుమారు 50 మంది పైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రమంతా ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తుందని గుర్తు చేశారు. రేవంత్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఐదు లక్షల చొప్పున ఖర్చులు భరిస్తూ ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎండి సమీర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుండగోని రామచంద్రు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మండల కార్యదర్శి రాచకొండ బాలరాజు, గద్దం సోమ నరసయ్య , నాయకులు మెంట నగేష్ తదితరులున్నారు.



# పిల్లాయిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి)

మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన గృహానికి గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో నిర్మించిన ఈ గృహంలో కాసుల సుమలత వెంకటేశం దంపతులు శుభకార్యాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమండ్ల మహాలక్ష్మి దానయ్య, ఉప సర్పంచ్ బంధారపు లక్ష్మణ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోడిసే నాగభూషణం గౌడ్, వార్డ్ సభ్యులు బి రెడ్డి సందీప్ రెడ్డి, కొమ్మన బాలస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు బండి అరుణ, ఉపాధ్యక్షుడు లింగాల మల్లేష్, మెట్టు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# .బొందుగుల సమీపంలోని వైన్స్, పర్మిట్ రూమ్.

## వైన్స్ యాజమాన్యం ఇష్టా రాజ్యం



రాజాపేట, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి ) రాజాపేట మండలం బొందుగుల సమీపంలో వైన్స్ యజమాన్యం ఇష్టా రాజ్యాంగా, నిబంధనలను పక్కన పెట్టి వ్యవహారిస్తున్నారు. ఇతర జిల్లాల గ్రామాల బెల్టు షాపులకు మద్యం అందజేస్తున్నారు. అంతేకాకుండా పర్మిట్ రూమ్ పూర్తి విరుద్ధంగా కొనసాగుతుంది. మద్యం దుకాణం గంటముందే ముసివేస్తున్నారు. అదేమిటని అడిగితే నిర్లక్ష్య సమాధానం చెబుతూ ఆధారగొట్టే మాటలు మాట్లాడుతున్నారు. ఈవిషయం పై ఆలేరు ఎక్సయిజ్, రాజాపేట పోలీసులు పట్టించుకోవాలని, లేకపోతే కలెక్టర్ కు పిర్యాదు చేయనున్నట్లు పలువురు హెచ్చరిస్తున్నారు.

### మెహర్ నగర్‌లో వధువుకు పెండ్లి కానుకలు అందజేత

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 30 (ప్రజాజ్యోతి)

మండలంలోని మెహర్ నగర్ గ్రామంలో పెండ్లి వేడుక సందర్భంగా వధువుకు నగదు, పట్టుచీరలను కానుకగా అందజేశారు. గ్రామానికి చెందిన తోటకూరి లక్ష్మమ్మ--నరసింహ దంపతుల కుమార్తె అఖిల (సహస్ర)కు ఈ కానుకలు అందించబడినవి. గ్రామ సర్పంచ్ సిలువేరు లక్ష్మయ్య తన తల్లిదండ్రులు సిలువేరు కిష్టమ్మ--వెంకయ్య జ్ఞాపకార్థంగా వధువుకు రూ.5000 నగదు, పట్టుచీరను అందజేశారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధువులు, యువకులు పాల్గొని వధూవరులకు ఆశీర్వాదాలు అందించారు.



# ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా, పారదర్శకంగా జరగాలి: కలెక్టర్ అనురాగ్ జయంతి

భువనగిరి ఏప్రిల్ 30(ప్రజా జ్యోతి న్యూస్)

గుండాల మండలం అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముందుగా కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం కుప్పలను, రైతులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. టార్పాలిన్లు, గన్నీ సంచులు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతమాత్రం ధాన్యం కొనుగోలు చేశారో, కేంద్రంలో తగిన తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోళ్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని, అనంతరం వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు తక్కువగా ఉన్న పక్షంలో వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం




ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో సాయి గూడెం గ్రామంలో ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం గ్రామ సర్పంచ్ గ్యార కవిత సంపత్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తాసిల్దార్ వలిగొండ ఆంజనేయులు హాజరై మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, మండల విద్యాధికారి లక్ష్మి, ఆర్ ఐ పూర్ణచంద్రరావు, జిపిఓ శ్రీనివాస్, ఏఎన్ఎం జయమ్మ, అంగన్వాడి టీచర్ ఆండాలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక మార్పు - తహశీల్దార్ రామకృష్ణ

చింతలపాలెం, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి) : విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని చింతలపాలెం తహశీల్దార్ రామకృష్ణ రెడ్డి అన్నారు. మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ కార్యక్రమం ఉపసర్పంచ్ మేడిశెట్టి నర్సింహారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతలపాలెం తహశీల్దార్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ అంటరానితనం కుల వ్యవస్థ ప్రాతిపదికన కొన్ని వర్గాలపై చూపే వివక్షపూరితమైన, అమానవీయమైన పద్ధతి అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు అంటరానితనం నిర్మూలనకు చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. విద్యావంతులైన ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా అందరినీ సమానంగా గౌరవించినప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోల్నెడి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అనిత కుమారి, మాజీ సర్పంచ్ మల్లెల నాగిరెడ్డి, ఆశా వర్కర్లు, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఈ కేవైసీని తక్షణం రద్దు చేయాలి

రాజాపేట ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి )

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులను ఇబ్బంది పెడుతు ఉపాధికి దూరం చేస్తున్న ఈ కేవైసీని వెంటనే రద్దుచేసి, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భూమిలేని ప్రతి పేద కుటుంబానికి సంవత్సరానికి 12వేల రూపాయలు ఇస్తానన్న హామీని తక్షణం అమలు చేయాలని కోరారు. గురువారం రాజపేట మండల ఎంపీడీవో కార్యాలయం ముందు ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించిన అనంతరం " ధర్నా" కార్యక్రమాన్ని నిర్వహించి సూపరిండెంట్ కు డిమాండ్స్ తో కూడిన మెమొరండాన్ని అందించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండే ఉపాధి హామీని ఎత్తివేయడానికి అనేక కుట్రలు చేస్తూ కొత్త కొత్త జీవోలు తెచ్చి ముఖ ఆధారిత ఫోటోలతో కూలీలను కష్టాలపాలు




చేస్తుందని విమర్శించారు. మరోపక్క 2005లో అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జి రామ్ జీ పథకం తెచ్చారని అన్నారు. పాత చట్టంలో కార్మికులకు అన్ని రకాల హక్కులు, పని కోసం అడగగానే పని ఇవ్వడం, జాబు కార్డుకు దరఖాస్తు చేసుకుంటే ఇచ్చేవారని అన్నారు. కానీ నేటి మోడీ తీసుకొచ్చిన జిరాంజీ పథకంలో కార్మికులకు ఉపయోగపడే ఏ ఒక్క హక్కు లేదని భూస్వాముల, పెట్టుబడిదారుల, పాలకుల దయాదాక్షనాల మీద కార్మికులు ఆధారపడి జీవించే విధంగా చట్టాన్ని రూపొందించారని విమర్శించారు. ఇప్పటికే చేసిన పనికి వేతనాలు సకాలంలో అందకపోవడం, నెలల తరబడి బకాయిలు పేరకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోపక్క కఠినమైన వాతావరణం పరిస్థితులలో ప్రధానంగా ఎండలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం కూడా దక్కడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంటు, ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్టు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ 800 ఇవ్వాలని అన్నారు.

# నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు





**మిర్యాలగూడ, ఏప్రిల్ 30,( ప్రజాజ్యోతి ):**

డబల్ బెడ్ రూమ్ పంపిణీలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ గురువారం మిర్యాలగూడ మున్సిపాలిటి బి ఆర్ ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎం.డి.ఇలియాస్ ఖాన్, సీనియర్ కౌన్సిలర్ పెద్ది శ్రీనివాస గౌడ్ ల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నాయకులు ఇంచార్జ్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ తహసిల్దార్ పి శ్రీనివాస్ లకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అధికారులు ప్రజల సమక్షంలో లాటరీ విధానంతో ఎంపికైన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల పేర్లను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో తొలగించటం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్హత ఉన్న పేదల హక్కులను కాలరాయటం ఎంతవరకు సమంజసం అన్నారు. అధికార దుర్వినియోగంతో పేదల జీవితాలతో ఆడుకోవడం ఆపాలన్నారు. తొలగించిన అర్హుల జాబితాను తక్షణమే పునరుద్ధరించాని,రాజకీయ ప్రేరిత నిర్ణయాలపై విచారణ జరపాలని కోరారు. నిజమైన లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదలకున్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమములో సందేషి అంజన్ రాజు, దీపిక విజయ్, గుడిసె జానకమ్మ దుర్గాప్రసాద్, లావుడి అరుణ సుధాకర్, మర్రి అంజి బాబు, తిరుమలగిరి వజ్రం,వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల సునీత కిరణ్,యర్రమల్ల దినేష్,పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర రావు, తిరంశెట్టి సీతా కోటేశ్వర రావు, గంగుల బిక్షం యాదవ్, భూక్య రాంబాబు, ఎక్కా స్వరూప మనిదీప్, ప్రేమ్ కుమార్,దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీ పిల్లలకు యూనిఫామ్‌ల పంపిణీ

చింతలపాలెం, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి) : కోదాడ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీవో పారిజాత ఆధ్వర్యంలో చింతలపాలెం



మండలంలోని అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు యూనిఫామ్ లను పంపిణీ చేశారు. పిల్లల శ్రేయస్సు, ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగానే యూనిఫామ్ ల పంపిణీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించడం, సమానత్వ భావన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్లు సరిత, వాణి, అంగన్వాడీ టీచర్లు, నగ్మా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు

ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలను అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. గురువారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతకింది రామానుజన్, చెక్క వెంకటేశు, బొమ్మ కంటి బాలరాజు, కే మెడీ ఉప్పలయ్య, మొరిగాడి రమేష్, కర్రే ఎల్లయ్య, నాగరాజు, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు

# 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించిన ప్రెసిడెన్సి పాఠశాల విద్యార్థులు




**బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్న విద్యార్థులు ఉపాధ్యా యులు**

**అభినందించిన పాఠశాల చైర్మన్ తీగల జయలక్ష్మి**

**భువనగిరి,ఏప్రిల్ 30**

(ప్రజాజ్యోతి)భువనగిరి,పట్టణంలో,విద్యా రంగంలో,విశిష్ట స్థానం సంపాదించిన ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్,స్కూల్స్ఈ సంవత్సరం,10వ,తరగతి ఫలితాల్లో మరోసారి అద్భుత విజయాన్ని,నమోదు చేసి అగ్ర స్థానంలో నిలిచింది.ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అత్యుత్తమ ఫలితా లతో,పట్టణంలో ముందం జలో నిలవడం సంస్థప్రతిష్టను మరింత పెంచిందని ప్రెసిడెన్సీవిద్యాసంస్థల చైర్మన్ తీగల జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు,ఈ విద్యా సంవత్సరంలో మా విద్యార్థు లు అసాధారణ ప్రతిభ కనబరిచి 100%ఉత్తీర్ణత సాధించడం,మా పాఠశాల కే గర్వకారణమని అన్నారు.ఈ ఫలితాల్లో భాగంగా గరిష్టంగా 581,మార్కులు సాధించిన విద్యార్థిని శ్రావ్య కు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి ప్రత్యేక శుభా కాంక్షలు తెలిపారు.అదే విధంగా సాత్విక్ 571,ఆశ్రీత 564,సపుర 563,సాత్విక 563,ధనలక్ష్మి 552,టి,శ్రీనిధి 552,మార్కులు ఉమయ్ మా ఫాతిమా 542, సాధించారని తెలిపారు. అలాగే 550, మరియు 500,మార్కులు పైగా 35,మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఆధునిక బోధన పద్ధతులు,నిరంతర పరీక్షలు, వ్యక్తిగత శ్రద్ధ,మరియు క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం ప్రెసిడెన్సీ విద్య సంస్థల విజయానికి మూల స్థంభాలు. ఉపాధ్యా యుల అంకితభావం,తల్లిదండ్రుల విశ్వాసం,మరియువిద్యార్థుల కృషి కలిసి ఈ అద్భుత ఫలితాలను సాధించినందుకు గర్వ పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన,విద్యార్థులందరికీ, వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయ బృందానికి పాఠశాల యాజమాన్యం హృదయ పూర్వక అభినం దనలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలనిఆకాంక్షించారు.. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు అకాడమిక్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సెస్సీ ఫలితాల్లో సత్తా చాటిన కేజీబీవీ చింతలపాలెం

**చింతలపాలెం, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి) :**

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) చింతలపాలెం ఎస్సెస్సీ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. మొత్తం 26 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవ్వగా, అందరూ ఉత్తీర్ణులవడంతో 100 శాతం ఫలితాలు నమోదయ్యాయి. ఈ ఫలితాల్లో ఆరుగురు విద్యార్థినులు 500కి పైగా మార్కులు సాధించడం విశేషం. టాప్ స్కోరర్లలో ముప్ప కావ్య 522 మార్కులు, మంగళపల్లి సుస్మిత 518 మార్కులు. జనిగ మహాలక్ష్మి, చిలక అర్చన తలా 512 మార్కులతో మెరుగైన ప్రతిభ కనబరిచారు. మునగ నవ్య 502 మార్కులు, దొంతరబోయిన నవ్య 500 మార్కులు సాధించారు. విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాన్ని సాధించామని ప్రత్యేక అధికారి టి. ప్రసన్న తెలిపారు.

# సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని శ్రీనివాస్ ఆత్మహత్య



**ఆలేరు ఏప్రిల్ 30 ప్రజా జ్యోతి**

గత కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సమస్యల వల్ల మనస్థాపానికి గురై శ్రీనివాస్ సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీసీ కాలనీలో చోటుచేసుకుంది. గురువారం ఆలేరు ఎస్సై వినయ్ కుమార్ స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణం బీసీ కాలనీకి చెందిన చింతపండు శ్రీనివాస్ 50 సంవత్సరాలు మున్నూరు కాపు కులానికి చెందినవారు మద్యానికి బానిసై అని చేయకపోవడంతో ఇంట్లో ఏమి చేయకుండా ఉండడంతో కుటుంబ సమస్యల వల్ల తన భార్య బొల్లపల్లిలో రోజు డ్యూటీ చేస్తుండగా అతని వదిలి వెళ్ళింది. అతను ఇంట్లో ఉంటూ రోజు మందు తాగుతూ గురువారం మధ్యాహ్నం సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని చనిపోయాడు . ఇరుగుపొరుగువారు గమనించి ఈ విషయం తన భార్య సునంద కు తెలియజేయడంతో ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడని గుర్తించింది. వెంటనే ఆలేరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

# విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు: అంజనీ సిమెంట్స్ ఎండి వెంకట్రాజు

చింతలపాలెం, ఏప్రిల్ 30 (ప్రజా జ్యోతి): చింతలపాలెం మండలంలో ఎస్ఎస్సీ - 2026 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీత మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల టాపర్లుగా నిలిచిన ఆదిమూలం వర్షిణి (578 మార్కులు), భూమిరెడ్డి సంజన (574 మార్కులు), ఆనంగి గోపీనాథ్ (566 మార్కులు)లను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజనీ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. వెంకట్రాజు మాట్లాడుతూ, విద్యార్థులు మండల స్థాయిలో టాపర్లుగా నిలవడం గర్వకారణమన్నారు. పాఠశాలలో అందిస్తున్న విలువలతో కూడిన విద్య వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేసి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాంటి విద్య దేశ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా టాపర్లకు పుష్పగుచ్ఛాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల




సెక్రటరీ శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు పీజే థోమస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమంపై కలెక్టర్ దృష్టి

**భువనగిరి ఏప్రిల్ 30(ప్రజా జ్యోతి న్యూస్)**

బీబీనగర్ మండల కేంద్రంలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం సెంటర్‌లో సేవలు పొందుతున్న వయోవృద్ధుల సంఖ్య, వారికి అందుతున్న ఆహారం, సౌకర్యాలు, వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. సిబ్బంది వివరాలు కూడా తెలుసుకున్నారు. వృద్ధులు విశ్రాంతి తీసుకునే గదులను పరిశీలించి పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణపై సూచనలు చేశారు. వయోవృద్ధులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని



అన్నారు. డాక్టర్ మరియు మెడికల్ సిబ్బందితో మాట్లాడి వృద్ధులకు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన చికిత్సలు సమయానికి అందించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వడ్లు కొనుగోలులో నిర్లక్ష్యం,రైతులను మోసం చేస్తున్న ప్రభుతం

**ఆలేరు, ఏప్రిల్ 30(ప్రజా జ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూర్ మండల శాఖ అధ్యక్షులు యెల్లంల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వడ్లు సగానికి పైగా కొనుగోలు చేశామని చెప్పడం పూర్తిగా తప్పుడు ప్రచారమని, తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమే జరుగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సందర్శనలో భాగంగా ఎక్కడి వడ్లు అక్కడే పేరుకుపోయి ఉండడం గమనించామని, వాటిని పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. మండలంలోని ఐకెపి సెంటర్లలో ఒకటి రెండు లారీలకు మాత్రమే వడ్లు తరలించగా, మిగతా వడ్లు అలాగే నిల్వ ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకొని అన్ని వడ్లను త్వరితగతిన తరలించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క) జిల కార్యదర్శి, పీసరి తిరుమలరెడ్డి, చిర్రా రవీందర్, అనంతర పాండురంగారెడ్డి, పాశం కృష్ణారెడ్డి, గాజుల బాలరాజ్, మల్గా అశోక్, సీస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలి..!

## - వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్

**దామరచర్ల , ఏప్రిల్ 30, ( ప్రజాజ్యోతి )**

: రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వి.శ్రీధర్ సూచించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు పేరిట అన్నదాతల అవగాహనా కార్యక్రమం లో భాగంగా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామ రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ లో ఉన్న వరి పంట రకాలు, వ్యవసాయయూనివర్సిటీ వరి రకాల సాగు గురించి రైతులకు తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ టి. హిమబిందు మాట్లాడుతూ రైతులు పంటమార్పిడి ఆవశ్యకతను గుర్తించాలని రైతులకు వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వైవిధ్యాకరణ, పండ్లు కూరగాయల సాగు, నీటి పొదుపు పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మిర్యాలగూడ ఉద్యాన అధికారి షేక్ నసీమ మాట్లాడుతూ ఉద్యాన శాఖ రైతులకు ఆయిల్ ఫామ్ తదితర తోటల పెంపకం, అందిస్తున్న సబ్సిడీలు, పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎన్.బాలకృష్ణ, ఎఇఓ సైదులు వ్యవసాయ శాఖ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కొండ్రపోల్ సర్పంచ్ పగిడి రాధరామలింగయ్య, దిలావర్పూర్ సర్పంచ్ బెజ్జం సైదులు లు మాట్లాడుతూ శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడిందని రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎఇఓ సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.మట్టారెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, టి.హిమబిందు ఆదర్శ రైతులు కొడాలి ప్రభాకర్, రమణ, రైతులు పాల్గొన్నారు.



# బిసి జె ఎ సి ఆధ్వర్యంలో ఘనంగా మహాకవి శ్రీ శ్రీ 116వ,జయంతి వేడుకలు

**మిర్యాలగూడ,ఏప్రిల్ 30, ( ప్రజాజ్యోతి ):**




మిర్యాలగూడ బీసీ జెఏసి ఆధ్వర్యంలో స్థానిక బీసీ భవన్‌లో మహాకవి ( శ్రీరంగం శ్రీనివాసరావు ) శ్రీ శ్రీ 116వ, జయంతి వేడుకలను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కవులు, సామాజిక కార్యకర్తలు శ్రీ శ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన సాహిత్య ప్రస్థానం, సామాజిక చైతన్యం, విప్లవాత్మక ఆలోచనలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ సందర్భంగా బీసీ జెఏసి కో-కన్వీనర్లు దాసరాజు జయరాజు, చేగోండి మురళి యాదవ్, పున్నా రాములుమాట్లాడుతూ, శ్రీ శ్రీ కవిత్వాన్ని ప్రజల జీవితాలతో అనుసంధానం చేసి, సామాజిక బాధ్యతను సాహిత్యంతో కలిపిన అరుదైన మహాకవి అన్నారు. ఆయన రచనలుకాలానుగుణంగా మారుతున్న భావాలు ఎప్పటికీ పాతబడవని, యువతలో చైతన్యం కలిగించడంలో ఆయన కవిత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కంపసాటి మధుసూదన్, యనగండ్ల నర్సయ్య, పొన్నెబోయిన వెంకన్న, నకిరేకంటి కిరణ్ కుమార్ శ్రీ శ్రీ సాహిత్యం సమాజానికి వెలుగుదారి చూపిందని పేర్కొన్నారు.

# నకిరేకల్ మండల టాపర్ గా శ్రీ చైతన్య విద్యార్థిని శ్రీ మాన్వి





నకిరేకల్‌లోని శ్రీ చైతన్య పాఠశాల బుధవారం 10వ తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేసింది, దీంతో ఆ పాఠశాలకు ఫలితాల సునామీ వచ్చింది. జి. శ్రీ మాన్వి 600కి 591 మార్కులతో అత్యధిక స్కోరు సాధించగా, ఆమెతో పాటు మరో 585, 580 మార్కులు సాధించారు. మొత్తం 54 మంది విద్యార్థులలో, 13 మంది 550కి పైగా మార్కులు, 34 మంది 500కి పైగా మార్కులు సాధించారు. మొత్తం సగటు మార్కులు 513గా ఉన్నాయి. యాజమాన్యం తరపున, ఏజీఎం సుజిత, హైస్కూల్ కోఆర్డినేటర్ ఎంఎన్ఆర్, ప్రిన్సిపాల్ కాటంరాజు, డీన్ సుష్మ, టెన్త్ ఇన్‌చార్జ్ వీరయ్య, ఉపాధ్యాయ బృందం ఈ అద్భుతమైన ఫలితాలను సాధించడంలో సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులను అభినందించారు. ఈ అద్భుతమైన ఫలితాలను సాధించడంలో నాయకత్వం వహించిన చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మరియు డైరెక్టర్ శ్రీవిద్య వారిని అభినందించారు. శ్రీ చైతన్య పాఠశాల టాప్ టెన్ ఫలితాలలో విజయం సాధించడం గర్వకారణమని శ్రీధర్ మరియు శ్రీవిద్య అన్నారు, భవిష్యత్తులో విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ముక్తాపూర్‌లో పిఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 30 (ప్రజాజ్యోతి)**


మున్సిపాలిటీలోని ముక్తాపూర్‌లో పిఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్లు శ్రీరామ్ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య యాదవ్, భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుక్క దానయ్య కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటలకు మద్దతు ధర పొందేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హాలియా మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి బదిలీ

**హాలియా,ఏప్రిల్30(ప్రజా జ్యోతి)**

హాలియా మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించిన ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి బదలీపై ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.ఇందుకు సంబంధించి గురువారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మున్సిపాలిటీ ఎన్నికల ముందు ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి హాలియా మున్సిపాలిటీకి బదిలీ పై వచ్చిన సంగతి తెలిసిందే.తిరిగి అదే మున్సిపాలిటీకి కమిషనర్ గా శ్రీనివాస్ రెడ్డి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా తన విధులు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలు అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.హాలియా నూతన మున్సిపల్ కమిషనర్ గా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ గా విధులు నిర్వహించిన రవీందర్ రెడ్డి హాలియా కమిషనర్ గా నియమితులయ్యారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.ఆర్‌బీఐ అధికారుల పిలుపు

**కాపుగల్లులో ఘనంగా ఆర్‌బీఐ బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమం**

**అపరిచితులకు ఓటీపీలు చెబితే మునిగిపోతారని హెచ్చరిక**

**కోదాడ రూరల్. ఏప్రిల్ 30 (ప్రజాజ్యోతి):**

ప్రస్తుత డిజిటల్ కాలంలో బ్యాంకింగ్ లావాదేవీలు ఎంత సులభమయ్యాయో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే తమ కష్టార్జితాన్ని కాపాడుకోగలరని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పిలుపునిచ్చారు. గురువారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు జిల్లా లీడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో 'బ్యాంకింగ్ అవగాహన శిక్షణ కార్యక్రమం' నిర్వహించబడింది. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నాగ ప్రసాద్, ఆర్‌బీఐ అధికారులు అసిస్టెంట్ మేనేజర్ ఆర్ జయరాజ్, పిండి గణేష్ సాగర్ లు మాట్లాడుతూ, నేటి కాలంలో ఏటీఎం కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వాడకం అనివార్యమైందని, అయితే వీటిని వాడే క్రమంలో కనీస జాగ్రత్తలు పాటించకపోతే ముప్పు తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నంబర్లు చెప్పకూడదని సూచించారు. ప్రస్తుతం సమాజంలో క్యూఆర్ కోడ్ స్కామ్స్ పెరిగిపోయాయని, ఎవరికైనా డబ్బులు పంపడానికి మాత్రమే స్కాన్ చేయాలని, డబ్బులు రావడానికి స్కాన్ చేయాల్సిన అవసరం లేదని క్లియర్ గా వివరించారు. అలాగే లాటరీ తగిలిందని, విదేశాల నుంచి గిఫ్ట్‌లు వచ్చాయని ఆశ చూపే మోసగాళ్లను నమ్మవద్దన్నారు. ఈ మధ్య కాలంలో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో పోలీస్ అధికారులమని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, చట్టంలో ఎక్కడా డిజిటల్ అరెస్ట్ అనే ప్రక్రియ లేదని ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక వడ్డీ ఆశ చూపే స్కీమ్‌లలో పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకోవద్దని, ఆర్‌బీఐ గుర్తింపు ఉన్న సంస్థల్లోనే లావాదేవీలు జరపాలని కోరారు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసానికి గురైతే నిమిషం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే '1930' నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలా చేస్తే పోగొట్టుకున్న డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఓటీపీ లేదా యూపీఐ పిన్ అడగరని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట నారాయణ, సి.ఎఫ్.ఎల్ సిబ్బంది దేవరశెట్టి సత్యనారాయణ, చింతకుంట్ల సతీష్, సిహెచ్. అశోక్ మరియు గ్రామంలోని మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

